క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు : తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టారు. మహిళలు మొక్కులు చెల్లించి కొబ్బరికాయలు కొట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో నవీన్‌కుమార్, ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షించారు.

నాగార్పమ్మ ఆలయంలో..

వాకాడు : మండల కేంద్రమైన వాకాడు గ్రామ దేవత నాగార్పమ్మ ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పెట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు కోటేశ్వరరావు అమ్మవారికి విశేష అలంకారం, అభిషేకాలు, కుంకుమ పూజ చేశారు. ఉభయకర్తలుగా రమాదేవి, సునీత, శకుంతలమ్మ, సుజన వ్యవహరించారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సూళ్లూరుపేట : లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ ఆధ్వర్యంలో ఆదివారం సూళ్లూరుపేట బస్టాండ్ సెంటర్‌లో పేదలకు అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు పీఆర్‌సీ మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అన్నదానం చేసినట్టు వారు తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి అప్పారావు, చార్టెడ్ ప్రెసిడెంట్ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైదాపురంలో మోస్తరు వర్షం


సైదాపురంలో కురుస్తున్న వర్షం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షం వ్యవసాయ పనులకు దోహదం చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షం కురిసి చెరువులకు నీరు చేరితే బాగుంటుందని ప్రజలు పేర్కొంటున్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి నవరాత్రి ఉత్సవాలు


వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని వ్యూహలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వారాహి అమ్మవారి నవ రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 9వ రోజు నవమి సందర్భంగా ఆలయం వద్ద వారాహి అమ్మవారితో పాటు శ్రీచక్ర యంత్ర మహా మేరువుకు పంచామృత అభిషేకాలు చేశారు. మూల మంత్రం, లక్ష్మీ సహస్రన నామ కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్ స్వామి మాట్లాడుతూ కాశీ గ్రామ దేవతగా పిలువబడే వారాహి అమ్మవారికి 9 రోజులు గుప్త నవరాత్రుల పేరిట ఉత్సవాలను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. సోమవారం రాత్రి ఉత్సవాలు ముగింపు పూజలు చేస్తామని పేర్కొన్నారు.


ప్రత్యేక అలంకారణలో వారాహి అమ్మవారు, శ్రీచక్రయంత్ర మహా మేరువు

మంచం పట్టిన పల్లెలు

వాతావరణంలో మార్పులు.. అడపాదడపా కురుస్తున్న వర్షాలు.. లోపించిన పారిశుద్ధ్యం.. వెరసి దోమలు వృద్ధిచెందాయి. అంటువ్యాధులు ప్రబలాయి. పల్లెలు మంచం పట్టాయి. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యక్రమాల పేరుతో షో చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. – పెళ్లకూరు

- పల్లెల్లో లోపించిన పారిశుద్ధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- ప్రబలిన జ్వరాలు
- ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్న గ్రామీణులు
- పట్టించుకోని అధికారులు

చెంబేడు పీహెచ్‌సీ



పెళ్లకూరు పీహెచ్‌సీ వద్ద ఉన్న రోగులు



పెళ్లకూరు మండలంలోని చెన్నప్పనాయుడుపేట, పుల్లూరు, జీలపాటూరు, పాలచ్చూరు, దిరసనమాల, చెంబేడు శిరసనంబేడు గ్రామాల్లో నివాసాల మధ్య పేడదిబ్బలు భారీగా ఉండడంతో దోమలు అభివృద్ధి చెందాయి. నెల రోజులుగా పల్లె ప్రజలు ఒక్కొక్కరుగా జ్వరాల బారిన పడ్డారు. ఎక్కువ మంది మంచం పట్టి వైద్యం అందక అల్లాడుతున్నారు. వాతావరణంలోని మార్పులతో పాటు గ్రామంలో నివాసాల మధ్య ఉన్న మురుగు గుంతల వలన దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు తెలిపినా పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో జ్వరాలు ప్రబలాయని వాపోతున్నారు.


పునబాకలో తాగునీటి బోరు వద్ద చెత్తాచెదారం

అందుబాటులో లేని వైద్యం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్యాధికారులతో పాటు సిబ్బంది సమయపాలన పాటించడం లేదు. దీంతో జ్వర పీడితులకు సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది 11 గంటలకు కూడా వైద్యశాలలకు రావడం లేదు. చెంబేడు పీహెచ్‌సీ రహదారికి దూరంగా ఉండడం వల్ల జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉంది. దీన్ని ఆసరాగా తీసుకున్న ఇక్కడి వైద్యసిబ్బంది ప్రజలకు సరైన వైద్య సేవలు అందించడం లేదు. దీంతో జ్వరాల బారిన పడిన రోగులు పట్టణాలకు పరుగులు తీస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

షో చేస్తున్న అధికారులు

గత పదిరోజులుగా మండల, క్షేత్ర స్థాయి అధికారులు, వైద్య సిబ్బందితో కలిసి క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లడం, మురుగు నిల్వలు తొలగించడం తదితర పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్టు ఫొటోలను జిల్లా ఉన్నతాధికారులకు అప్‌లోడ్ చేస్తూ షో చేస్తున్నారు. మండలంలో ఎక్కడ కూడా దోమలు లేవు, జ్వరాలు లేవు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. మండలంలో పెళ్లకూరు, చెంబేడు ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీ వైద్య సేవలు అందించడంలో లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు. కనీసం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు పూర్తి స్థాయిలో నిర్వహించకపోవడం విశేషం.


పెళ్లకూరులో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్)


దిరసనమాలలో రోడ్డు పక్కనే ఉన్న పేడదిబ్బలు

> **మెడికల్ క్యాంప్‌లు, పారిశుద్ధ్య పనులకు చర్యలు**
>
> వాతావరణంలో మార్పులు, కురుస్తున్న వర్షాలకు నేలంతా చిత్తడిగా మారడంతో పాటు మురుగునిల్వలకు వర్షపునీరు చేరడంతో దోమల వ్యాప్తి ఎక్కువైంది. గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై సలహాలు అందిస్తాం. అలాగే పారిశుద్ధ్య పనులు చేపట్టి మెడికల్ క్యాంపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.
>
> – అన్నపూర్ణరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో

ఘనంగా చర్చి వార్షికోత్సవం

చిల్లకూరు : మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న యోహాను లూథరన్ చర్చి వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ చర్చిని 20 ఏళ్ల క్రితం మంచాల లలితమ్మ ఆధ్వర్యంలో నిర్మించారు. అప్పటి నుంచి ఎంతో మంది దైవ సేవకులు ఇక్కడి నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 20వ వార్షికోత్సవం సందర్భంగా సంఘ కాపరి ఆనంద్ దైవ సందేశం అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మంచాల లలితమ్మ కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో చర్చి సభ్యులు వినోద్‌కుమార్, పత్రి శివయ్య, ఎం సుధీర్, జోగి కిషోర్, నిఖిత్, సలోమి, హెప్సీబా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మంచాల లలితమ్మ

ఆక్రమణ పేరుతో పేదల ఇళ్లు కూల్చడం తగదు

సూళ్లూరుపేట: ప్రభుత్వ స్థలంలో పేదలు నిర్మించుకున్న ఇళ్లను అక్రమ కట్టడాల పేరుతో మున్సిపాలిటీ అధికారులు కూల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూళ్లూరుపేట పట్టణ శివారు ప్రాంతమైన కేసీఎస్ గుంట చెరువులో కొంతమంది పేదలు ఇళ్లు నిర్మించుకుని కాపురం ఉంటున్నారు. అదే క్రమంలో నిరుపేద కుటుంబానికి చెందిన వైఎస్సార్ సీపీ అభిమాని వంకా సుధాకర్ కూడా ఇల్లు నిర్మించుకుంటున్నాడు. గోడలు పూర్తయి పైకప్పు వేయాల్సి ఉంది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది టీడీపీ నేతలు, మీడియా ప్రతినిధులు పనిగట్టుకుని అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. అధికారులు కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండానే అధికార పార్టీ నేతల ఆదేశాలతో ఇల్లు కూల్చివేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. టీడీపీ అండదండలుంటే ప్రభుత్వ భూముల్లో ఇళ్లు, షాపులు నిర్మించుకున్నా అధికారులు పట్టించుకోరని, పేదల ఇళ్లు మాత్రమే కనిపిస్తాయా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ అండదండలు ఉంటే సక్రమమే..

జాతీయ రహదారిపై వున్న హోలీ క్రాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సమీపంలో శేషసాయి కల్యాణ మండపం వెనుక కాళంగి నది ప్రవహిస్తోంది. నది పొర్లుకట్ట పై అనేక మంది ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు. ఈ ప్రాంతం బఫర్ జోన్‌లో ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ నిర్మాణాలు చేస్తున్న వారికి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన ఒక మంత్రి అండదండలున్నాయని, అందువల్లే అటువైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ సెంటర్‌లో అక్రమ కట్టడాలు చేపడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.


నిరుపేద ఇల్లు కూల్చివేస్తున్న మున్సిపాలిటీ అధికారులు

జీఎస్‌టీ రోడ్డుపై ఆక్రమణలు కనిపించలేదా!

కేసీఎస్‌గుంట చెరువు ప్రాంతంలో ఇల్లు కూల్చిన అధికారులకు సూళ్లూరుపేట పట్టణంలో నిత్యం జనం, వాహనాలతో రద్దీగా ఉండే జీఎస్‌టీ రోడ్డుపై ఆక్రమణల కనిపించలేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. హోలీ క్రాస్ నుంచి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం వరకు రోడ్డును ఆక్రమించి షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చారని, వాటి జోలికి ఎందుకు వెళ్లడం లేదని నిలదీస్తున్నారు. బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ హైస్కూల్ ముందున్న జీఎస్‌టీ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి హోటళ్లు నడపడం కనిపించలేదా అని అంటున్నారు. వీటిపై మున్సిపల్ అధికారులు సమాధానం చెప్పాలని నిలదీస్తున్నారు. అదే విధంగా సూళ్లూరుపేట పట్టణంలో 1975లో ప్రభుత్వ నిర్మించిన బావులను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేశారని, వాటి గురించి కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలని, కోళ్లమిట్ట ప్రాంతంలోని రేడియో రూం పక్కనే వున్న ప్రభుత్వ బావిని ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఆపాలని సూచిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


చరణ్


శ్రావ్య

చిల్లకూరు : చిల్లకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జె.చరణ్ (586) ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్‌ఎం జాన్ పీటర్ తెలిపారు. విద్యార్థిని అభినందించారు.

కోటపోలూరు విద్యార్థిని..

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కావలి శ్రావ్య (574) ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఆమెను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.


గురుకుల విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పుదూరు బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.రోషిణి(570), కే వర్ష(569), ఎం.హర్ష (569), ఎం.ప్రమాతి(567) ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని ఆదివారం ప్రిన్సిపాల్ రూత్ రమోల, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

దొరవారిసత్రం : మండలంలోని తనియాలి, అక్కరపాక, బూదూరు, పోలిరెడ్డిపాళెం, శ్రీధనమల్లి, కల్లూరు, వెదరుపట్టు తదితర గ్రామాల్లో ఆదివారం సచివాలయ, వైద్య సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధుల్లో చెత్తను, ఇళ్ల మధ్యలో ఉన్న పేడ దిబ్బలను తొలిగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వాకాడులో..

వాకాడు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ఆదివారం వాకాడులో పంచాయతీ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లోని చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామాల్లో డెంగీ, మలేరియా, డయేరియా బారిన పడినవారి వివరాలు సేకరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. పంచాయతీ సెక్రటరీ ఉమామహేశ్వరరావు, వైద్య సిబ్బంది రామరాజు, ముత్యాలయ్య పాల్గొన్నారు.


వాకాడులో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది


దొరవారిసత్రంలో..

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని జాతీయ రహదారి కూడలి సమీపంలో ఒక టీ దుకాణంలో చోరీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ గోపి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన జగన్నాథం టీ దుకాణంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. కౌంటర్లో ఉన్న నగదు, గ్యాస్ సిలిండర్ తదితర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం జాతీయ రహదారి కూడలి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు జగన్నాథం దుకాణంలో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారు విన్నమాల గ్రామానికి చెందిన బాల సుబ్రమణ్యం, నాయుడుపేట ఎస్‌ఎస్‌ఆర్ కాలనీకి చెందిన పృథ్వీగా గుర్తించారు. వారి నుంచి రూ.6 వేల నగదు, గ్యాస్ సిలిండర్ తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కండలేరులో 6.303 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి కండలేరు జలాశయానికి 80 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ఉచితం ఎక్కడ ?



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామని చెబుతోందని, ఇసుక స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే తడిసి మోపెడు అవుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి దుయ్యబట్టారు. పట్టణంలోని ఓ ప్రయివేటు కళాశాలలో ఆదివారం సీపీఐ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకునే క్రమంలో ఇసుక ఉచితంగా దొరుకుతుందని స్టాక్ పాయింట్ల వద్దకు వెళితే అక్కడ ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలు పడుతోందని తెలిపారు. ఉచితంగా ఎలా ఇస్తారో కూటమి ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. గతానికి, ఇప్పటికి తేడా లేదన్నారు. ఇలా అయితే భవన నిర్మాణ రంగం పూర్తిగా దెబ్బతింటుందని, పనులు లేక కూలీలు ఇబ్బందులు పడతారని వివరించారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి ఉచితంగా ఇసుక ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా గత ఏడాది కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అభ్యుదయ వేదిక జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పారదోలేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శశి, కాలేషా, సీవీఆర్ కుమార్, ఎంబేటి చంద్రయ్య, నారాయణ, రమేష్, భాస్కర్, క్రిష్ణయ్య, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ద్విచక్ర వాహనం బోల్తా


తీవ్రంగా గాయపడిన రాజారెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పదో మైలు గ్రామ సమీపంలోని కేటీరోడ్డు మలుపు వద్ద ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తా పడడంతో తొట్టంబేడు మండలం పెద్దకన్నలికి చెందిన రాజారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అతను బుచ్చినాయుడుకండ్రిగ నుంచి శ్రీకాళహస్తికి వెళుతుండగా మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్ర గాయపడిన రాజారెడ్డిని పోలీసులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పల్లె ప్రయాణం నరకం


చెంబేడు-పునబాక ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు

పెళ్లకూరు: మండలంలో కురుస్తున్న వర్షానికి గ్రామీణ ప్రాంతాల రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ప్రయాణం సాగించేందుకు నరకం అనుభవిస్తున్నారు. మండలంలోని కప్పగుంటకండ్రిగ, దిరసనమాల, పాలచ్చూరు, కిష్టప్పకండ్రిగ, నందిమాల, యడపూడి, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ గ్రామాలకు వెళ్లే రోడ్లలో పెద్దపెద్ద గుంతలు పడి అధ్వానంగా మారాయి. గ్రావెల్ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో చిధ్రంగా మారాయి. మండలంలో 28 కిలోమీటర్ల వరకు రోడ్లు దెబ్బతిన్నాయని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా పాలచ్చూరు, కప్పగుంటకండ్రిగ పంచాయతీ రోడ్లతో పాటు చెంబేడు-పునబాక ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నందిమాల, కిష్టప్పకండ్రిగ గ్రామాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డుపై కంకరరాళ్లు పూర్తిగా తేలిపోవడంతో కాలినడకన వెళ్లడం కూడా కష్టంగా ఉందని స్థానికులు వాపోతున్నారు.


ఆగిన బస్సులు

రోడ్లలో గుంతలు పడడంతో అర్ధమాల, నందిమాల, పిడికిటిమాల, మోదుగుల పాళెం గ్రామాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆటో డ్రైవర్లు అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో ప్రయాణ సాధనాలు లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పాలకులు మారినా గ్రామీణ రోడ్ల దుస్థితిని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోస్తరు వర్షం కురిస్తే కలవకూరు చెప్టాపై స్వర్ణముఖి నది వరదనీరు ప్రవాహం వల్ల ఆర్టీసీ సర్వీసులు నిలిపేస్తున్నారు. దాంతో కలవకూరు, అనకవోలు, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, పాలచ్చూరు గ్రామాల ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. 71వ నంబరు జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరుకు వెళ్లే పీఆర్ రోడ్డులో కేబుల్ ఏర్పాటు కోసం తవ్వకాలు చేపట్టి వదిలేయడం వల్ల గోతులు పడి రాకపోకలకు తీవ్ర అగచాట్లు పడుతున్నారు.


కప్పగుంటకండ్రిగ రోడ్డులో కేబుల్ కోసం తవ్వి వదిలేసిన గుంత


చెన్నప్పనాయుడుపేట గ్రామంలో వర్షానికి బురదమయంగా మారిన వీధి

> **వర్షం కురిస్తే ఆర్టీసీ బస్సు నిలిపేస్తారు**
>
> 
>
> జోరుగా వర్షాలు కురిసి స్వర్ణముఖి నది, మామిడి కాలువలో ప్రవహిస్తే ఆర్టీసీ బస్సు సర్వీసును నిలిపేస్తారు. అత్యవసర సమయాల్లో పట్టణాలకు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రోడ్లలో గుంతలు పడడంతో వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి.
>
> – మునికృష్ణయ్య, పాలచ్చూరు

> **రోడ్లన్నీ గుంతలమయం**
>
> 
>
> చెరువుల నుంచి మట్టి, గ్రావెల్‌ను లారీలతో తరలించడం వల్ల రోడ్లలో పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల గుంతల్లో నీరు నిలిచి ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఆటోలు, మోటారు బైక్‌లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.
>
> – తిరుపాలయ్య, అర్ధమాల